క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలోని శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి తొండవాడకు చెందిన రిటైర్డ్ ఎంఈఓ మల్లికార్జున్ రెడ్డి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. సోమవారం ఈ నగదును ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. దాతను పాలకమండలి సభ్యులు ఘనంగా సత్కరించారు.

డీప్ ఫ్రీజర్ వితరణ



డీప్ ఫ్రీజర్‌ను అందజేస్తున్న పీటీసీ అధికారులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం కళ్యాణి డ్యాం సమీపంలోని పోలీస్ శిక్షణ కేంద్రం అధికారులు మంగళంలోని బాలల జువనైల్ హోమ్‌కు డీప్ ఫ్రీజర్‌ను వితరణ చేశారు. ఆహార పదార్థాలు నిల్వ చేసుకునేందుకు ఉపయోగపడుతుందని పీటీసీ సీఐ శ్యాం సుందరం తెలిపారు. కార్యక్రమంలో పీటీసీ అధికారులు అశ్విని, షణ్ముఖరావు, లక్ష్మీపతి, భానుకిరణ్మయి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుక అందజేస్తున్న పార్టీ నాయకులు

తిరుపతి మంగళం: తిరుపతి రూరల్ మండలం రణధీర్‌పురం పంచాయతీ బీటీఆర్‌కాలనీకి చెందిన వరుడు అనిల్‌కు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను సోమవారం ఆ పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ మల్లె మొగ్గల ఉమాపతి అందజేశారు. సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు.

14న పూతలపట్టులో జాబ్‌మేళా

రేణిగుంట: పూతలపట్టు మండలం పేటమిట్టలోని అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఈనెల 14న ఉదయం 10 గంటలకు పూతలపట్టు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అమరరాజ యాజమాన్యం తెలిపింది. టెన్త్, ఇంటర్ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఎంపికైన వారికి మల్టీ స్కిల్ టెక్నీషియన్ కింద 2 సంవత్సరాలు శిక్షణ ఇస్తామని, శిక్షణానంతరం మూడు నెలలు హాస్టల్, భోజన వసతి కల్పించి, రూ.7500 స్టైఫండ్ ఇస్తామని, తదుపరి కంపెనీలో ఉద్యోగ శిక్షణకు తీసుకున్నాక రూ.11,640 వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇతర వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 9000024919, 9100477371

నివాళి



నివాళులర్పిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల: మండలంలోని మద్దినాయపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వాసు సోదరి చినకాంపల్లి కృష్ణవేని సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టోల్‌గేట్ వద్ద బస్సు ప్రమాదం

తిరుమల: తిరుమల జీఎన్‌సీ టోల్ గేట్ వద్ద అడ్డంగా దూరిన ఓ కారును తప్పించబోయి ఆర్టీసీ బస్సు రక్షణ గోడను ఢీకొన్న సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మంగళం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి తిరుమలకు ప్రయాణికులతో బయలుదేరింది. వీరి వాహనం జీఎన్‌సీ టోల్ గేట్ వద్దకు వస్తుందనగా ముందుగా ఉన్న కారు అకస్మాత్తుగా బస్సులు వెళ్లే మార్గంలోకి ప్రవేశించింది. దీంతో కారును తప్పించబోయి బస్సు అదుపు తప్పి రక్షణగోడను ఢీకొని ఆగిపోయింది. కారు డ్రైవర్ అవగాహన రాహిత్యంతోనే ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఎవరికీ ఎలాంటి ప్రమాదం కలగలేదు. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

తిరుమలకు చేరుకున్న కేంద్ర మంత్రి

తిరుమల: శ్రీవారి దర్శనార్థం కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రి పియూష్ గోయల్ సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. స్థానిక అతిథి గృహం వద్ద కేంద్ర మంత్రికి టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. టీటీడీ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ బస ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కేంద్ర మంత్రి శ్రీవారి మూలమూర్తిని దర్శించుకోనున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..





వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉత్సాహంగా.. ఉల్లాసంగా బడికి హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రుల రాకతో తిరుపతి నగరంలోని పాఠశాలల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. స్నేహితులు, తోటి విద్యార్థులతో కరచాలనం చేసి ఆప్యాయంగా పలకరించుకున్నారు. చాలా రోజుల తర్వాత కలుసుకోవడంతో చిరునవ్వులు చిందిస్తూ సరదాగా గడిపారు. తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు అందజేయడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

-తిరుపతి













సచివాలయాలతో సత్వర సేవలు

- నేరుగా ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు
- పొద్దు పొడవకముందే పింఛన్ల పంపిణీ

ఎర్రావారిపాళెం(భాకరాపేట): ఒకప్పుడు సంక్షేమ పథకాల కోసం అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా పథకాలు అందుతాయన్న నమ్మకం ఉండేది కాదు. నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారికే సిఫార్సు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన సచివాలయాలతో పరిపాలన ప్రజల ముంగిటకే చేరింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అర్హత ఉన్న వారి ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. ఎర్రావారిపాళెం మండలంలో 26,773 మంది జనాభా ఉన్నారు. 8654 కుటుంబాలు ఉన్నాయి. 12 గ్రామ పంచాయతీలు ఉండగా 11 సచివాలయాలు పనిచేస్తున్నాయి. వాటిలో 92 మంది సిబ్బంది, 151 మంది గ్రామ వలంటీర్లు పనిచేస్తున్నారు. సచివాలయాల ద్వారా సుమారు 500లకు పైగా సేవలను స్థానికంగానే అందజేస్తున్నారు. ముఖ్యంగా కుల, ఆదాయ,



ఎర్రావారిపాళెం సచివాలయం

నివాస ధ్రువీకరణ పత్రాలతోపాటు ప్రతి పనీ సులభంగా స్థానికంగానే జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పింఛను, ఇళ్లు, ఇంటి స్థలం కోసం గతంలో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పని లేకుండా పోయిందని, సమయం వృథా కావడం లేదని చెబుతున్నారు. ఎర్రావారిపాళెం మండలం అటవీ ప్రాంతమైనా 100 శాతం పథకాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయి.

మండలం	:	ఎర్రావారిపాళెం
జనాభా	:	26773
ఇళ్లసంఖ్య	:	8654
గ్రామ పంచాయతీలు	:	12
గ్రామ వార్డు సచివాలయాలు	:	11
సచివాలయ సిబ్బంది	:	92
వాలంటీర్ల సంఖ్య	:	151

లబ్ధిదారుని చెంతకే సంక్షేమం



సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత అర్హతే ప్రామాణికంగా పథకాలను ప్రజలకు అందజేస్తున్నాం. వలంటీర్ లబ్ధిదారు ఇంటి వద్దకే వెళ్లి దరఖాస్తు తీసుకువచ్చి పథకాలు మంజూరు చేసేలా చూస్తున్నారు. ప్రజలు మండల కేంద్రానికి వచ్చే పనిలేకుండా స్థానికంగానే అన్ని సేవలు అందజేస్తున్నాం.

-అమర్నాథ్, ఎంపీడీవో, ఎర్రావారిపాళెం

సర్టిఫికెట్లన్నీ సచివాలయంలోనే



మా పిల్లలు చదువులకు అవసరమైన కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు సచివాలయంలోనే ఇస్తున్నారు. గతంలో ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా పనులు జరిగేవి కాదు. ఇప్పుడు ఆ పనిలేదు. ఖర్చు లేకుండా మా ఊళ్లోనే మా వలంటీర్ ఇంటికే తెచ్చి ఇస్తున్నారు.

-రమేష్‌కిశోర్‌రెడ్డి, ఎర్రావారిపాళెం

వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అన్ని సేవలు



జగనన్న ప్రభుత్వం సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారు. అప్పటి నుంచి ఏ పథకమైనా నేరుగా మా ఇంటికే వచ్చి అందజేస్తున్నారు. ఎవ్వరి వద్దకు వెళ్లి మాకు అది కావాలి, ఇది కావాలి అని అడుక్కునే పని లేదు. అర్హత ఉంటే చాలు పథకాలు మంజూరవుతున్నాయి.

- మనోజ్, బీసీ కాలనీ, ఎర్రావారిపాళెం

బస్సు, ఆటో ఎక్కే పనిలేదు



మేము అటవీ ప్రాంతంలో ఉంటున్నాం. మా ఊరి నుంచి మండల కేంద్రానికి రావాలంటే రూ.50 నుంచి రూ.100 వరకు ఖర్చు అవుతుంది. సచివాలయాలు వచ్చిన తరువాత తిరిగే పనిలేకుండా పోయింది. అప్పుడు ఖర్చుతో పాటు కూలి పనులు వదులుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

-శ్రీకాంత్, కలికిరివాండ్లపల్లె

చెవిరెడ్డికి కాంట్రాక్ట్ లెక్చరర్ల వినతి



చెవిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్

తిరుపతి రూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్లు కోరారు. సోమవారం తుమ్మలగుంటలో ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ నాయకులు దీప, శివశ్వేత, ప్రసాద్, బాలు మాట్లాడుతూ.. కట్ ఆఫ్ డేట్ నిబంధన పెట్టడం వల్ల 2009 నుంచి 2012 వరకు కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా ఉన్న వారు రెగ్యులర్ అయ్యే అవకాశం లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కట్ ఆఫ్ డేట్‌తో సంబంధం లేకుండా తెలంగాణ ప్రభుత్వం చేసినట్లే కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అందరినీ రెగ్యూలర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన చెవిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

మనం కాదు.. మన పనులే మాట్లాడతాయి



మున్సిపల్ పార్క్-ధోబీ ఘాట్ మాస్టర్‌ప్లాన్ రోడ్డు ప్లాన్‌ను పరిశీలిస్తున్న భూమన అభినయ్

–డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: జగనన్న ప్రతి సభలో చెప్పేమాట ఒక్కటే.. మనం కాదు.. మనం చేసే పనులే మాట్లాడతాయి అన్న నినాదాన్ని అందిపుచ్చుకుని ఆర్భాటాలకు దూరంగా తిరుపతిలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పార్క్ ఎదురుగా ధోబీ ఘాట్-సత్యనారాయణపురం సర్కిల్ వరకు ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్ రోడ్డును సోమవారం స్థానిక కార్పొరేటర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి నగరానికి కనెక్టివిటీ పెంచడం, మరో 3 వేల ఎకరాల్లో తిరుపతిని విస్తరించడం, నగరంపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లను చేపట్టినట్లు చెప్పారు. వీటితో పాటు మరో 3 ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు తెలిపారు. గత పాలకులు ఆర్భాటాలకు వెళ్లి అది చేస్తాం.. ఇది చేస్తాం అని కాలయాపన చేశారన్నారు. మేమెప్పుడూ అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెప్పమని.. చేసి చూపించాకే మాట్లాడతాం అని అన్నారు. మున్సిపల్ పార్క్ నుంచి ధోబీఘాట్ మీదుగా సత్యనారాయణపురం కూడలి వరకు మాస్టర్‌ప్లాన్ రోడ్డు అభివృద్ధి జరిగితే సునాయాసంగా వాహన రాకపోకలకు వీలుంటుందన్నారు. డీఈఈ విజయ్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్‌లు అనీష్ రాయల్, కోటేశ్వరమ్మ, అన్నా అనితాయాదవ్, అన్నా సంధ్యాయాదవ్, నాయకులు అన్నా రామచంద్రయ్య యాదవ్, ఏఆర్.వెంకటేష్, సురేంద్రారెడ్డి, కదిరి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నవనీతమ్మ మృతికి నివాళి

తిరుపతి మంగళం: తిరుపతి టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తొండమనాటి వెంకటేష్‌రెడ్డి తల్లి తొండమనాటి నవనీతమ్మ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఎస్‌కేడీనగర్‌లోని వెంకటేష్‌రెడ్డి నివాసానికి వెళ్లి నవనీతమ్మకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆహార పరిశుభ్రత లోపిస్తే చర్యలు తప్పవు



మహిళ నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న కమిషనర్ హరిత

- కమిషనర్ హరిత

తిరుపతి తుడా: హోటళ్లలో ఆహార పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన ఆహారం అందించకున్నా, పరిశుభ్రత పాటించకుండా నిబంధనలను అతిక్రమించినా చర్యలు తప్పవని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో పలు హోటళ్లపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. నాణ్యత లోపించిందని, కిచెన్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ హరిత, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణతో పాటు ప్రజా ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి యాత్రికులు వస్తుంటారని, వారికి నాణ్యమైన, పరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని అందించాలన్నారు. తిరుపతికి ఉన్న ప్రతిష్ఠను దృష్టిలో ఉంచుకుని హోటళ్ల యజమానులు వ్యవహరించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పరిశుభ్రత లోపిస్తే భారీ జరిమానాలు విధించక తప్పదన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హోటళ్లను తరచూ తనిఖీలు చేయాలని సూచించారు. రైతు బజార్ వద్ద వేసిన ఫెన్సింగ్ వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎక్కువయ్యాయని, లక్ష్మీపురం కూడలి వద్ద రహదారి అధ్వానంగా ఉందని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలానే నగరంలో కుక్కల బెడత విపరీతంగా ఉందని వచ్చిన ఫిర్యాదులపై స్పందించారు. ఇలా మొత్తం డయల్ యువర్ కమిషనర్-12, స్పందన-17 ఫిర్యాదులు అందాయి. వీటిపై సమీక్ష నిర్వహించిన కమిషనర్ వెంటనే ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళేశ్వర రెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు కేఎల్.వర్మ, సేతుమాధవ్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

దళితులకు శ్మశాన స్థలాన్ని అప్పజెప్పాలి

తిరుపతి కల్చరల్: తిమ్మినాయుడుపాళెం దళితులు ఏళ్లుగా వినియోగిస్తున్న శ్మశానం ఆక్రమణకు గురైందని.. సర్వే చేసి దళితులకు అప్పజెప్పాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి పి.వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఆదివారం తిమ్మినాయుడు పాళెంలో ఒక దళితుడు మరణిస్తే అతని మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా వీలులేని పరిస్థితి తలెత్తడమే ఇందుకు నిదర్శమని తెలిపారు. ఆర్డీఓ, తహసీల్దార్ చొరవ తీసుకుని సర్వే చేయించాలని కోరారు.

మంత్రి నాగార్జునకు ఘన స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న ప్రవీణ్

తిరుపతి కల్చరల్: తిరుపతికి వచ్చిన రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జునకు సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ యలమంచిలి ప్రవీణ్, ఎం.జీవరత్నం రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, దేవసహాయం ఘనస్వాగతం పలికారు.

బాలకార్మిక వ్యతిరేక ర్యాలీ



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జేసీ బాలాజి



పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: చదువుకునే వయసులో పనులకు వెళ్లడం తప్పు అని, పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే.బాలాజీ అన్నారు. సోమవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ నుంచి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వరకు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ.. 14 ఏళ్లలోపు పిల్లలను ఎట్టిపరిస్థితుల్లో దుకాణాలు, సంస్థలు, ఇటుక బట్టీలు, హోటల్స్ వంటి వాటిల్లో పనికి పెట్టుకోరాదన్నారు. ప్రమాదకర ప్రదేశాల్లో బాలలతో పనిచేయిస్తే మూడు నెలల నుంచి రెండేళ్ల పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ బాలు నాయక్, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఎస్పీ కాటమరాజు, ఐసీడీఎస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



తిరుపతి డిపోలో ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో అంకితభావంతో పనిచేస్తున్న పలువురు డ్రైవర్లు, కండక్టర్‌లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సోమవారం తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కండక్టర్‌లు వీకే.కుమార్, ఎస్.మునెమ్మ, శ్రీవిద్య, లక్ష్మీకుమారి, మల్లికార్జున్, లత, డ్రైవర్లు రత్నం, రమేష్, వీకే.రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివశంకరయ్య, కలందర సాహెబ్, నాగరాజు, వెంకటకుమార్, అమానుల్లా, గ్యారేజ్ సిబ్బంది అంకయ్య, గురవయ్య ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అలాగే మంగళం డిపోలో పనిచేస్తున్న కండక్టర్‌లు జయంతి, నీలకంఠయ్య, కేఎస్.లత, బి.హరి, డ్రైవర్లు ఎస్‌సీ.మౌళి, కె.చంద్రయ్య, జీవీ.రత్నం, వీఏ.రెడ్డి, ఎంఆర్.కుమార్, ఎస్ఎస్.వర్మ, ఎంటీ.నాయుడుకు డిపో మేనేజర్ కేసీజీ.భాస్కర్ ప్రశంసా పత్రాలను అందజేశారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనంద్‌ప్రకాష్



చంద్రగిరి: విద్యా కానుకను అందిస్తున్న ఆనంద్

చంద్రగిరి(తిరుపతి రూరల్): పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు పెట్టి ఆదుకుంటోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనంద్ ప్రకాష్ కొనియాడారు. సోమవారం చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు కార్యక్రమం వల్ల కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దారని తెలిపారు. గతంలో స్కూల్ ప్రారంభించిన చాలా రోజులకు పుస్తకాలు అందించేవారని, ప్రస్తుతం స్కూల్ ప్రారంభించిన మొదటి రోజే విద్యా కానుక కింద పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్, షూ, బెల్టు అందజేశారన్నారు. చంద్రగిరి మండలంలో 4,577 మంది విద్యార్థులకు మొదటి రోజే జగనన్న కిట్లు అందించినట్లు ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ లలిత కుమారి, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ



రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: విద్యార్థులు జగనన్న విద్యాకానుకను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి అన్నారు. మండలంలోని కుప్పంబాదూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుజనకుమారితో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సురేష్, ఎంపీటీసీ కృష్ణవేణి పాల్గొన్నారు.